నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల వనపర్తి
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 11 మార్చి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

రేకుల ఇల్లు తొలగించి.. రోడ్డున పడి..

పక్క చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు చింతకుంట బిచ్చమ్మ. వనపర్తి మండలం అప్పాయిపల్లి ఈమె ఊరు.. భర్త బిచ్చయ్య, మరో కూతురు ఉన్నది. వీరికి భూమి లేదు. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంది. బిచ్చమ్మకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. ప్రస్తుతం రేకులషెడ్‌లో బిచ్చమ్మ ఉంటుండగా.. అధికారుల ఒత్తిడి మేరకు షెడ్‌ను తొలగించి సోమవారం ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోసుకున్నది. అయితే, ఎలాంటి ప్రత్యామ్నాయం లేని ఆమె పక్కనే ఓ చిన్న జాలి ఏర్పాటు చేసుకొని తన వస్తువులను పెట్టుకుని అక్కడే వంటా.. వార్పు చేసుకుంటుంది. అత్యంత దయనీయమైన పరిస్థితి ఆమెది.. ఉన్న రేకుల షెడ్డును తొలగించుకొని రోడ్డున పడింది.. బేస్తులు కట్టుకుంటే రూ.లక్ష బిల్లు వస్తుందని అధికారులు చెప్పడంతో తాను ముగ్గు పోసుకున్నట్లు బిచ్చమ్మ చెప్పింది.

జాడలేని రేషన్ కార్డులు

అప్పాయిపల్లిలో 40 మందికి కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. జనవరిలో మంజూరైనట్లు తెలుసుకొని ముచ్చటపడటమే తప్పా లబ్ధిదారులకు ఒరిగిందేమి లేదు. అదే నెలలోనే కొత్త కార్డులిచ్చి బియ్యం కూడా అందిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో మాత్రం జరగలేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మార్చి నెల వచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని, దీనిపై ఒక్కొక్కరు ఒక్కొక్క తీరులో చెబుతున్నారని ఆవేదన చెందుతున్నారు. మీసేవ ద్వారా కొత్త కార్డులు పొందవచ్చని చెబుతున్నా.. అక్కడికి వెళితే సైట్ ఓపెన్ కావడం లేదని చెబుతున్నారన్న విమర్శలున్నాయి. ఇలా ఆఫీసుల చుట్టూ తిరగడం తప్పా మాకు కొత్త కార్డులు ఎప్పుడు వస్తాయో? తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లా కుర్వపల్లి గ్రామ వ్యూ

పైలట్.. నో గ్యారెంటీ!

- వనపర్తి జిల్లా అప్పాయిపల్లిలో జాడలేని పథకాలు
- ఇండ్ల స్కీమ్‌పై నీలినీడలు.. ముగ్గు పోసుకొన్న లబ్ధిదారులు
- కార్డుల కోసం కండ్లల్లో ఒత్తులేసుకొని అర్హుల నిరీక్షణ

వనపర్తి, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలు సమస్యల ఒడిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రతి మండ లానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులకు సంక్షేమ పథకాలను అంది స్తామని జనవరి 26న అట్టహాసంగా మండ లానికో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇలా వనపర్తి జిల్లాలో 15 గ్రామాలను పథకాలు ముందస్తుగా అమలు చేసేందుకు ఎంచుకున్నారు. అయితే ఇప్పటి వరకు నాలుగు పథకాల్లో రెండింటిలోనే కదలిక ఉండగా, మరో రెండు అటకెక్కాయి. దీంతో ప్రధానంగా ఇందిరమ్మ ఇండ్లకు ఆశపడ్డ వారంతా రోడ్డున పడ్డారు. వనపర్తి మండలం అప్పా యిపల్లి, పెద్దమందడి మండలం మంగంపల్లి, అమరచింత మండలం చింతా డ్డిపల్లి, ఆత్మకూరు మండలం దేవరపల్లి, ఘణపురం మండలం సల్కెలాపురం, గోపాల్‌పేట మండలం చెన్నూరు, మదనాపురం మండలం దంతనూరు, పాన్‌గల్ మండలం మాధవరావుపల్లి, పెబ్బేరు మండలం ఈర్లదిన్నె, శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లి, రేవల్లి మండలం తల్పునూరు, వీపనగండ్ల మండలం సంపత్రావుపల్లి, ఏదుల మండలం చీర్కపల్లి, చిన్నంబావి, కొత్తకోట మండలం రామానంతపురం గ్రామాలను ప్రత్యేకంగా గుర్తించారు. ఈ నాలుగు సంక్షేమ పథకాలను ఈ గ్రామాల్లో వంద శాతం అమలుకు శ్రీకారం చుట్టారు.

కార్డుల కోసం వస్తున్నారు

కొత్త రేషన్ కార్డులు మంజూరైన వారు గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి అడుగుతున్నారు. పై అధికారులు చెప్పే సూచనలనే మేం చెబుతున్నాం. మీ సేవ ద్వారా కొత్త కార్డులను పొందే అవకాశం ఉందని, అక్కడి నుంచే తీసు కోవాలని చెబుతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం చాలా ప్రయత్నం చేస్తున్నాం. ఈరోజే 12 మందికి ముగ్గులు పోశాం. ఎక్కువ మంది ప్రోసీడింగ్స్ పొందినా నిర్మాణాలకు అంతగా మొగ్గు చూపడం లేదు.

- నర్మద, గ్రామ కార్యదర్శి, అప్పాయిపల్లి, వనపర్తి జిల్లా

రేషన్ కార్డులు.. ఎదురుచూపులు

వనపర్తి మండలం అప్పా యిపల్లి గ్రామం నాలుగు సంక్షేమ పథకాల అమలుకు ఎంపికైంది. ఈ మేరకు అప్పట్లో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మేఘా రెడ్డిఈ పథకాలను గ్రామంలో ప్రారంభించారు. అయితే ఈ గ్రామంలో 559 మంది రైతులుంటే.. అందరికీ రైతు భరోసా అందింది. వీరికి రూ.45,96,498 రైతుల ఖాతాల్లో జమ య్యాయి. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం 119 మందికి ప్రోసీడింగ్స్ అందించారు. 40 మందికి కొత్త రేషన్‌కార్డులు మంజూరైనా లబ్ధిదారులకు ఇంకా అందించలేదు. అలాగే ఆత్మీయ భరోసా పథకంలో 27 మందిని గుర్తించారు. వీరికి 27 మందికి వీరికి 1.62 లక్షలు జనవరిలోనే పడినట్లు గ్రామ కార్యదర్శి నర్మద వెల్లడించారు.

అప్పాయిపల్లిలో ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసిన దృశ్యం

ఇండ్ల పథకంపై అనుమానాలు

అప్పాయిపల్లి గ్రామంలో 119కి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు జనవరి 26న ప్రోసీడింగ్స్ ఇచ్చారు. ముందుగా నిరు పేదలను గుర్తించి ఈ ఎంపికలను చేశారు. అయితే, ప్రోసీడింగ్స్ తీసుకున్న వారంతా నిర్మాణాలకు ముందుకు రావడం లేదు. అనేక దఫాలు ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి పలుమార్లు చెప్పినా ముందుకు రావడం లేదు. అధికారుల ప్రయత్నాలన్నీ వృథా అవుతున్నాయి. చివరకు ఇండ్లు కట్టుకోని పక్షంలో రద్దవుతాయని హెచ్చరిస్తున్నా.. ముందుకు రాకపోవడంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై మాత్రం నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. ఎట్టకేలకు 12 మంది మాత్రం ముందుకు రాగా.. సోమవారం నిర్మాణాలకు ముగ్గు పోసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సక్రమంగా నిధులు ఇవ్వడం లేదన్న ఆలోచనతోనేఇలా ఇండ్లకు ముందుకు రావడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

కాగితాలకే పరిమితం!

- పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో అటకెక్కిన సంక్షేమ పథకాలు
- కానరాని వందశాతం అమలు
- జాబితా సిద్ధం చేసినా కొర్రీలే..
- ప్రభుత్వం చెప్పిందొకటి.. వాస్తవ పరిస్థితి మరోటి..
- గద్వాల, వనపర్తిలో జనాగ్రహం

గద్వాల/గద్వాల రూరల్, మార్చి10 : అబద్ధాల హామీల పునాదులపై గద్దెనెక్కిన రేవంత్ సర్కారు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని రైతులు,ప్రజలు ఆరోపిస్తున్నారు. జనవరి 26న పైలట్ ప్రాజెక్టు కింద ప్రతి నియోజకవర్గంలోని ఓ మండలంలో గ్రామాన్ని ఎంపిక చేశారు. ఆ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వందశాతం అమలు చేసి.. స్ఫూర్తిగా మిగతా గ్రామాల్లో అమలు చేస్తామని ప్రభుత్వంలోని పెద్దలు ప్రగల్భాలు పలికారు. అయితే వాస్తవ పరిస్థితి అందకు భిన్నంగా ఉన్నది. ఎంపిక చేసిన గ్రామాల్లో వంద శాతం సంక్షేమ పథకాల అమలు అటకెక్కింది. అయితే అమలు తీరు తెలిసేందుకు అధికారులు భయపడుతున్నారు. 'ప్రభుత్వం చెప్పింది మేం చేస్తున్నాం.. అంతే తప్పా మమ్మల్ని సమాచారం కోసం ఇబ్బందులు పెట్టవద్దు'.. అంటూ అధికారులు ప్రాధేయపడుతున్న పరిస్థితి. ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు గ్రామాల్లో రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను వంద శాతం అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ దిశగా ముందుకు సాగడంలో పూర్తిగా విఫలమైందని ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. పబ్లిసిటీ కోసం చెప్పి అమలు చేయడంలో విఫలం కావడంతో పథకాలు గ్రామాల్లో నిద్దరోతున్నాయి. ఈ నేపథ్యంలో పైలట్ గ్రామాలుగా ఎంపికైన గద్వాల మండలం కుర్వపల్లి, (నల్లదేవరపల్లి), కేటీదొడ్డి మండలం ఉమిత్యాలలో 'నమస్తే' బృందం పర్యటించి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీసింది.

వందశాతం అమలేదీ..?

కాంగ్రెస్ సర్కారు ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలను వందశాతం అమలు చేస్తామని చెప్పినా ఆ దిశగా ప్రయత్నాలు ఇంకా మొదలు పెట్టలేదు. దీంతో ఆ గ్రామాల్లో వందశాతం సంక్షేమ పథకాల అమలు అటకెక్కింది. కుర్వపల్లి(నల్లదేవరపల్లి) గ్రామంలో రైతు భరోసా రైతులందరికీ, ఆత్మీయ భరోసా కూడా అందరికీ వచ్చింది. కానీ రుణమాఫీ మాత్రం పూర్తి స్థాయిలో కాలేదు. ఇందిరమ్మ ఇండ్ల కోసం 141 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 22 దరఖాస్తులను వివిధ కారణాలతో అధికారులు తిరస్కరించారు. మిగతా 119 మందికి అన్నా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారా? అంటే ఇప్పటి వరకు మంజూరు విషయమై లబ్ధిదారులకు తెలియదు. అధికారుల వద్ద ఉన్న కాగితాల మీదే ఇవన్నీ ఉన్నాయే తప్పా వాస్తవంగా ఏది కనిపించదు. కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డుల లబ్ధిదారులను ఎంపిక చేయగా గ్రామంలో కేవలం 51 మంది జాబితా మాత్రమే అధికారుల వద్ద ఉన్నది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులు ఎటు పోయాయో ఎవరికీ అర్థం కావడం లేదు.

ఆందోళనలో ఇండ్ల లబ్ధిదారులు

సంక్షేమ పథకాలు వంద శాతం అమలులో భాగంగా కేటీదొడ్డి మండలంలోని ఉమిత్యాల గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. అక్కడ రైతులకు రైతు భరోసా, ఉపాధి కూలీలు తక్కువగా (24 మంది) ఉండడంతో వారికి ఆత్మీయ భరోసా అమలైంది. కుల గణనలో భాగంగా ఇళ్లు లేని నిరుపేదలు 185 మందిని గుర్తించారు. ప్రస్తుతం ఇండ్ల ఎంపికలో 109 మంది లబ్ధిదారుల జాబితా మాత్రమే రావడంతో మిగతా వారు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో రేషన్ కార్డులు కేవలం ఐదు మందికి మాత్రమే మంజూర యాయి. తిరిగి దరఖాస్తు చేసుకోమని అధికారులు చెప్పగా కొత్తగా 91 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎంపిక చేశారు కానీ.. పథకాల అమలు మాత్రం మొదలు పెట్టలేదు. ఎంపిక చేసిన గ్రామాల్లో అరకొరగా అమలు చేసి.. మేము ఇచ్చిన మాట ప్రకారం అన్ని అమలు చేశామని ప్రభుత్వం ఉట్టిమాటలు చెబుతున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చెప్పింది ఒకటి.. వాస్తవం మరోటి..

పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రభుత్వం వంద శాతం హామీలు అమలు చేస్తామని చెప్పింది.. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. ఈ గ్రామాల్లో ఎక్కడ కూడా సంక్షేమ పథకాలు అమలు కాలేదు. కేవలం కాగితాలు, అధికారుల రికార్డుల్లో మాత్రమే కనిపిస్తాయి కానీ..

వాస్తవ అభివృద్ధి ఏదీ కనిపించదు.

కుర్వపల్లిలో ఇల్లు లేక రేకులషెడ్డులో ఉంటున్న కృష్ణ

కుర్వపల్లిలో గుడిసెలో నివాసముంటున్న కుర్వ రాముడు

జాబితాలో పేరు ఉందో? లేదో? చెప్పడం లేదు

మాది గుడిసె. ఇందులో నాతోపాటు నా కుమారుడు, వారి పిల్లలతో నివాసం ఉంటున్నాం. ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. మా గ్రామంలో గ్రామసభ జరిగే సమయంలో గందరగోళం ఏర్పడగా అధికారులు అర్హులైన వారి జాబితా చదవకుండా వెళ్లిపోయారు. ఇప్పటి వరకు జాబితాలో తమ పేరు ఉందో? లేదో? తెలుసుకుందామంటే ఎవరూ చెప్పడం లేదు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇంటికి తాము అర్హులమో? కామో? తేల్చుకోలేక పోతున్నాం. అధికారులు స్పందించి వివరాలు వెల్లడించాలి.

- కుర్వ రాముడు, కుర్వపల్లి, గద్వాల మండలం

ఇందిరమ్మ లబ్ధిదారుల వివరాలేవీ?

మాది గుడిసె. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఇంటికి తాము అర్హులమో? కాదో? అధికారులు చెప్పడం లేదు. అసలు జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలుసుకుందామంటే అధికారులు చెప్పలేరు. దీంతో మేము ఆందోళన చెందుతున్నాం. గ్రామ సభలో పేర్లు ప్రకటించే సమయంలో గందరగోళం నెలకొనగా అధికారులు పేర్లు చదవకుండా వెళ్లిపోయారు. ఇప్పటి వరకు ఇండ్ల కోసం ఎవరు అర్హులు, ఎవరు కాదో? అధికారులు చెప్పడం లేదు. దీంతో మాకు ఇళ్లు వస్తుందో? రాదో? అనే అనుమానం కలుగుతోంది. అధికారుల జాబితాలో ఉన్న వివరాలు వెల్లడించాలి.

- కృష్ణ, కుర్వపల్లి, గద్వాల మండలం

పసిబిడ్డకు సీపీఆర్ చేస్తున్న వైద్య సిబ్బంది

చిన్నారికి సీపీఆర్

- ప్రాణాలు కాపాడిన నర్వ దవాఖాన సిబ్బంది

మక్తల్, మార్చి 10 : అప్పుడే పుట్టిన బిడ్డకు కదలికలు లేకపోవడంతో వైద్య సిబ్బంది సీపీఆర్ చేసి చిన్నారి ప్రాణాలు కాపాడిన ఘటన నారాయణపేట జిల్లా నర్వ మండలంలో సోమవారం చోటుచేసుకున్నది. మక్తల్ నియోజకవర్గంలోని నర్వ మండలం రాయికోడు గ్రామానికి చెందిన అఖిల సోమవారం అర్ధరాత్రి ప్రసవం కోసం నర్వ పీహెచ్‌సీకి వచ్చింది. వైద్య సిబ్బంది వెంటనే చికిత్సలు ప్రారంభించడంతో తెల్లవారు జామున 5:26 నిమిషాలకు నార్మల్ డెలివరీ అయ్యి మగబిడ్డ జన్మనిచ్చింది. అయితే బిడ్డలో ఎలాంటి కదలికలు లేక పోవడంతో అప్రమత్తమైన సిబ్బంది ఆక్సిజన్ అందించినా ఎలాంటి చలనం లేక పోగా సీపీఆర్ నిర్వహించారు. వెంటనే కదలికలు రావడంతో 108లో పసిబిడ్డకు మెరుగైన వైద్యం అందించడం కోసం మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించారు. 108 సిబ్బంది, నర్వ వైద్య సిబ్బంది వాహనంలో వైద్య సేవలు అందించడంతో బిడ్డ ప్రాణాపాయం నుంచి బయటపడిందని డాక్టర్ మమత తోపాటు దవాఖాన సూపరింటెండెంట్ వైద్య సిబ్బంది, 108 సిబ్బందిని అభినందించారు.

నల్లమలో కార్చిచ్చు

కొల్లాపూర్ రూరల్, మార్చి 10 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని నల్లమల అడవులలో కార్చిచ్చు రాజుకున్నది. నాలుగైదు రోజుల నుంచి అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. దాదాపు 100 ఎకరాల్లో మంటలు అంటుకోగా.. బ్లోయర్స్ సాయంతో మంటలను అదుపు చేశామని కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. గత నెల 24వ తేదీ ముందు నుంచి నల్లమలలో కార్చిచ్చు రాజుకుంటున్నదని తెలిపారు. అటవీ ప్రాంతాల సమీపంలో ప్రజలు, గొర్రెల కాపరులు అగ్నికి సంబంధించిన వస్తువులు తీసుకెళ్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో క్యాడవర్ డాగ్స్‌తో సహాయ చర్యలు చేపట్టిన కేరళ బృందం

కొనసాగుతున్న సహాయక చర్యలు

- ఎస్ఎల్‌బీసీలో క్యాడవర్ డాగ్స్‌తో గాలింపు
- రెస్క్యూ టీమ్‌లతో ఉన్నతాధికారుల సమీక్ష

నాగర్‌కర్నూల్/ బల్మూరు, మార్చి10 : ఎస్ఎల్‌బీసీలో చిక్కుకున్న కార్మికులను గుర్తించేందుకు కేరళకు చెందిన క్యాడవర్ డాగ్స్‌తో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెక్రటరీ అరవింద్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే పంజాబ్ రాష్ట్రానికి చెందిన గురుప్రీత్ సింగ్ మృతదేహాన్ని ప్రమాద స్థలం నుంచి బయటకు తీసి పోస్టుమార్టం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు తరలించారు. ఈ నేపథ్యంలో సోమవారం టన్నెల్‌లో మరో 7మందికి కోసం అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారులు మట్టి దిమ్మెలు కూలితే వాటికి సపోర్టుగా కట్టెలు ట్రైన్‌లో తీసుకెళ్లారు. సహాయక చర్యలో భాగంగా సాంకేతిక నిపుణులు, రేస్క్యూ ఆపరేషన్, రక్షణ, సహాయక , గాలింపు చర్యలో పురోగతి ఉండవచ్చు అని అధికారులు భావిస్తున్నారు. మరో రెండు రోజుల్లో రోబోలతో చిక్కున్న కార్మికులను బయటకు తీసుకవచ్చేందుకు కృషి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. ప్రమాదస్థంలో నీళ్లు రావడంతో వాటిని పైప్ లైన్ ద్వారా బయటకు పంపిస్తున్నారు. అయితే గురుప్రీత్ సింగ్ మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు సంతాపం ప్రకటించారు. అదేవిధంగా మృతుడి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా ప్రకటించినట్లు అధికారులు వెల్లడించారు. టన్నెల్ వద్ద సహాయక సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. అయితే 12 రెస్క్యూ బృందాలు లోపలికి వెళ్లి సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. మరో మూడు మృతదేహాలు ఉన్నట్లు సింగరేణి జీఎం, సిబ్బంది డాగ్స్ సహాయంతో గుర్తించినట్లు సమాచారం. జీఎం బైద్య నేతృత్వంలో సహాయక చర్యలు వేగంగా సాగుతున్నాయి. ఈ పనులను కలెక్టర్, ఎస్పీలు పర్యవేక్షిస్తున్నారు.

చేతకాకపోతే గద్దె దిగండి

- పెండింగ్ పాలబిల్లులు చెల్లించాల్సిందే..
- కాంగ్రెస్ ప్రభుత్వంపై పాడి రైతుల కన్నెర్ర
- పెద్దాపూర్ వద్ద హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై రాస్తారోకో

పెద్దాపూర్ వద్ద హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై రాస్తారోకో చేస్తున్న పాడి రైతులు

వెల్దండ, మార్చి 10 : పెండింగ్ పాలబిల్లులు చెల్లించాలని, చేతకాకపోతే వెంటనే గద్దె దిగిపోవాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వెల్దండ మండలం పెద్దాపూర్ గేటు వద్ద హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై పాడి రైతులు రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోతో ఎక్కడికక్కడ భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ రాత్రిం బవళ్లు కష్టపడి, అప్పులు చేసి పశుగ్రాసం తెచ్చి విజయ్ డెయిరీకి పాలు పోస్తే 3నెలలుగా బిల్లులు చెల్లించకుంటే ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో ఏనాడు లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడి రైతులు రోడ్డెక్కే దుస్థితి దాపురించిందని ఆరోపించారు. పాలించడం చేతకాక పోతే ఎందుకు ఉండాలని, వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వం అనే చెప్పుకునే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకా, రైతులను మోసగించిందని మండిపడ్డారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయని విద్యార్థులకు ఇబ్బందులు కలించవద్దని సూచించగా పాడి రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, నాయకులు, రైతులు వెంకటయ్య, యాదయ్య, శేఖర్, అమరేందర్, వీరారెడ్డి, పర్వతాలు, అయ్యన్న, పర్వతాలు, తిర్పతయ్య, వెంకటయ్య, బాపు, ఇదమయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

ఊర్కొండ : బొమ్మరాజుపల్లిలో పాలక్యాన్లతో ధర్నా నిర్వహిస్తున్న పాడి రైతులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఊర్కొండ, మార్చి 10 : పెండింగ్‌లో ఉన్న పాలబిల్లులు వెంటనే చెల్లించాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. మండలంలోని ఊర్కొండపేట, బొమ్మరాజుపల్లి, ఇప్పపహాడ్ గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాల వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మంగళవారం కల్వకుర్తిలో నిర్వహించే పాడి రైతుల నిరసన కార్యక్రమానికి రైతులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

వడ్లకు బోనస్ చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన


గద్వాలలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గద్వాల, మార్చి10 : తమ ధాన్యం కొనుగోలు చేసి మూడు నెలలు కావస్తున్నా ప్రభుత్వం మా ఖాతాల్లో బోనస్ జమచేయకుండా కాలయాపన చేస్తుందని, దీంతో తమకు రైతు భరోసాలేక, బోనస్ రాక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే బోనస్ చెల్లించాలంటూ సోమవారం అయిజ మండలం బైనపల్లికి చెందిన సుమారు 50మంది రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుర్వ పల్లయ్య మాట్లాడుతూ రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రూ.500బోనస్ ఇస్తామని చెప్పి మూడు నెలలు కావస్తున్నా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం బోనస్ జమచేయకుండా రైతులను మోసం చేస్తున్నదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సర్కారు అసత్య ప్రచారంతో గద్దెనెక్కి కొనుగోలు సెంటర్ల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి తక్షణమే బోనస్ చెల్లిస్తామని మాయమాటలు చెప్పి ఇప్పటి వరకు చెల్లించకుండా రైతులను నట్టేట ముంచారన్నారు. రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తూ వారితో కన్నీరు పెట్టిస్తున్న సర్కారు ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ సర్కారే అన్నారు. వెంటనే రైతుల ఖాతాల్లో బోనస్ జమచేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అయిజ మండలంలోని బైనపల్లి, రాజపురం, పులికల్, చిన్న తాండ్రపాడు రైతులు నూర్ పాషా, నవాజ్, మహబూబ్‌అలీ, చంద్రశేఖర్‌రెడ్డి, చక్రవర్ధన్‌రెడ్డి, ఉరుకుందు, మౌలాళి, ఆంజనేయులు, మల్లేశ్, ఆలంపాషా, మైబు, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేస్తే ఎవరైనా శిక్షార్హులే..

అలంపూర్,మార్చి 10 : విధి నిర్వహణలో ఎవరు తప్పు చేసినా, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినా శిక్షార్హులేనని జోగుళాంబ ఆలయ కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. అలంపూర్ ఆలయాలపై గత కొంత కాలంగా మీడియాలో వస్తున్న వరుస కథనాలపై సోమవారం ఆయన స్పందించారు. ఆలయాల విశిష్టతను కాపాడే బాధ్యత ప్రతిభక్తుడిపై ఉందన్నారు. ఆలయ పూజారి ఆనం డ్కర్మపై వస్తున్న ఆరోపణలు ఆయన వ్యక్తిగతమని అవి పక్క రాష్ట్రంలో జరిగినవని, ఆ సమస్య కోర్టు పరిధిలో ఉందని, కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆలయంలో అర్చకులు, సిబ్బంది, ఎవరి విధులు వారు నిర్వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయంలో అవినీతి, కానుకలు కనుమరుగు అన్న అంశాలపై దేవాదాయ శాఖ విచారణ చేపట్టింది త్వరలోనే అన్ని విషయాలు బయటపడతాయన్నారు. ఏది ఏమైనప్పటికీ అలంపూర్ క్షేత్రం ప్రతిష్టను దెబ్బతీసేలా ప్రవర్తించడం సరికాదన్నారు.